సాక్షి
పార్వతీపురం మన్యం
మంగళవారం । 24 । సెప్టెంబర్ । 2024



ధరల మంట

మార్కెట్‌లో నిత్యావసర సరుకుల ధరలు మండి పోతున్నాయి. సామాన్య, మధ్యతరగతి ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

- 8లో



అధికంగా రెవెన్యూ సమస్యలు

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అర్జీలు కుప్పలు తెప్పలుగా వచ్చాయి.

- 8లో

అనుమతులు తప్పనిసరి

విజయనగరం క్రైమ్: దీపావళి పండగ వస్తున్న నేపథ్యంలో బాణసంచా తయారీ, నిల్వలు, విక్రయాలకు అనుమతులు తప్పనిసరని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి స్పష్టంచేశారు. గతంలో జరిగిన ఘటనలను దృష్టిలో పెట్టుకుని తనిఖీలను ముమ్మరం చేయాలని విశాఖరేంజ్ పరిధిలోని ఎస్పీలను సోమవారం ఆదేశించారు. ఎటువంటి అనుమతులు లేకుండా బాణసంచా విక్రయాలు చేపట్టేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

న్యూస్‌రీల్

సీడీఏసీఏ అపాయింట్‌మెంట్లను నమ్మవద్దు



జిల్లా విద్యాశాఖ అధికారి జి.పగడాలమ్మ

పార్వతీపురం టౌన్: చిల్డ్రన్ డెవలప్మెంట్ ఎడ్యుకేషన్ ఛేంజింగ్ అసోసియేట్ ద్వారా వచ్చిన ఫేక్ అపాయింట్మెంట్లను నమ్మవద్దని జిల్లా విద్యాశాఖ అధికారి జి.పగడాలమ్మ తెలిపారు. స్థానిక డీఈఓ కార్యాలయంలో విలేకరులతో సోమవారం మాట్లాడారు. విద్యాశాఖలో ఉద్యోగాలంటూ సీడీఈసీఏ సంస్థ నిరుద్యోగుల వద్ద నుంచి కొంత మొత్తాన్ని వసూలు చేసి అపాయింట్మెంట్ లెటర్లు సృష్టించి ఇస్తోందన్నారు. ఈ సంస్థ చేతిలో మోసపోవద్దని నిరుద్యోగులను ఆమె కోరారు. విద్యాశాఖలో ఉద్యోగాలు కేవలం ప్రభుత్వం ద్వారా వచ్చిన నోటిఫికేషన్ ద్వారానే ఉంటుందన్నారు.

డ్వామా పీడీగా శివయ్య

పార్వతీపురం టౌన్: జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన శివయ్యను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన పీడీ రామచంద్రరావును అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీ చేసింది. జిల్లాలో ఉపాధి హామీ, గ్రామ వార్డు సచివాలయ అధికారిగా రామచంద్రరావు విధులు నిర్వహించి మంచి పేరు సంపాదించారు.

బాధ్యతల స్వీకరణ



కె.సాయికృష్ణచైతన్య

పార్వతీపురం టౌన్: జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారిగా కె.సాయి కృష్ణచైతన్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఆయన విశాఖ పట్నంలో విధులు నిర్వహించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారిగా విధులు నిర్వహించిన యు.సాయికుమార్ శ్రీకాకుళం జిల్లాకు బదిలీపై వెళ్లారు.

పైడితల్లి దర్శనం ఉచితం

- తొలేళ్లు, సిరిమానోత్సవం రోజున ప్రత్యేక ఏర్పాట్లు
- పైడితల్లి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్న మంత్రి కొండపల్లి



విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారిని తొలేళ్లు, సిరిమానోత్సవం పర్వదినాల్లో భక్తుల కు ఉచిత దర్శనం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో ఆ రెండు ప్రత్యేక దినాల్లో ఉచిత దర్శనంతో పాటు రూ.100, రూ.300 రూ.50 వంతున టికెట్ల అమ్మకం ద్వారా దేవాలయానికి సుమారు రూ.15 లక్షల ఆదాయం వచ్చేదన్నారు. లక్షలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకోవాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఉచిత దర్శన సదుపాయం కల్పించిందన్నారు. అక్టోబర్ 15న జరిగే సిరిమానోత్సవం నాడు రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలను మంత్రి శ్రీనివాస్ సమర్పించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర దేవదాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.సత్యనారాయణ సోమవారం జీఓ నంబర్ 656 జారీ చేసినట్టు కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓ ప్రకటనలో తెలిపారు.

తల్లీబిడ్డ ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ సేతు మాధవన్

విజయనగరం ఫోర్ట్: తల్లీబిడ్డ ఆరోగ్యంపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ తెలిపారు. పౌష్టికాహార మాసోత్సవంలో భాగంగా పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 1నుంచి నుంచి పౌష్టికాహార మాసోత్సవాల కార్యక్రమాల నిర్వహణలో రాష్ట్రస్థాయిలో మొదటిస్థానంలో నిలిచామన్నారు. అమ్మపేరుతో జిల్లాలో సుమారు 13వేల మొక్కలు నాటినట్టు వెల్లడించారు. రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు మాట్లాడుతూ అమ్మవడి నుంచి అంగన్‌వాడీకి వెళ్తున్న బిడ్డను అమ్మలాగే సాకాలన్నారు. జెడ్పీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ శాంతకుమారి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 18 మంది గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. పౌష్టికాహారంపై నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన బాలికలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి, సివిల్ సప్లై డీఎం కె.మీనాకుమారి పాల్గొన్నారు.



ప్రజల సమస్యలపై మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

చిరుబతుకులపై.. రెడ్‌బుక్ రాజ్యాంగం

- కలెక్టర్‌తోపాటు, అధికారులంతా పసుపు చొక్కాలతోనే విధులు
- వీవోఏల తొలగింపుపై మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆగ్రహం
- 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'లో కలెక్టర్‌కు వినతి
- చంద్రబాబు హామీని నిలబెట్టుకోవాలని వలంటీర్ల నిరసన
- అన్యాయంగా విధుల నుంచి తొలగించారని కేజీబీవీ ఉద్యోగుల ఆవేదన
- ధర్నాలతో హోరెత్తిన కలెక్టరేట్

సాక్షి, పార్వతీపురం మన్యం/పార్వతీపురం: చిరుద్యోగులపై 'రెడ్‌బుక్' రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని పార్వతీపురం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు విమర్శించారు. సాక్షాత్తు కలెక్టర్‌తో పాటు, జిల్లా అధికార యంత్రాంగమంతా పచ్చ చొక్కాలు వేసుకుని అధికార పక్షానికి వంతపాడుతున్నారని.. ఈ విధానం మార్చుకోకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమానికి అర్జీదారులు పోటెత్తారు. తమను అన్యాయంగా విధుల నుంచి తొలగించడాన్ని నిరసిస్తూ పలువురు చిరుద్యోగులు, తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని వివిధ వర్గాల వారు నినాదాలతో హోరెత్తించారు.

రాజకీయ ఒత్తిళ్లతో చిరుద్యోగులను తొలగిస్తారా?



కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి చిరుద్యోగులను తొలగించడం భావ్యం కాదని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. గ్రామాల్లో చిరుద్యోగులైన వీఓఏలు, క్షేత్ర సహాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలను నిర్దాక్షిణ్యంగా తొలగిస్తున్నారని.. వారి కుటుంబాలను వీధిన పడేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి చిరుద్యోగులపై వేధింపులకు పాల్పడుతోందని తెలిపారు. కార్యక్రమంలో మండల ఎంపీపీ మజ్జి శోభారాణి, జడ్పీటీసీ ప్రతినిధి బలగ నాగేశ్వరరావు, పార్టీ నాయకులు బి.రమేష్, కొండపల్లి బాలకృష్ణ, సర్పంచ్‌లు గండి శంకరరావు, శ్రీరంజన్, మడక విశ్వనాథం, వై.తిరుపతిరావు, పండు, రమణ, రాజారావు, సతీష్, వెంకన్న, శ్రీనివాసరావు, తొలగింపునకు గురైన వీవోఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వలంటీర్ల వేదన



తాము అధికారంలోకి వస్తే వలంటీర్లకు రూ.10వేలు జీతం చేస్తామని.. ఉద్యోగ భద్రత కల్పిస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం నిలువునా మోసగించిందని గ్రామ/వార్డు వలంటీర్లు వాపోయారు. మూడు నెలల నుంచి జీతాలు చెల్లించడం లేదు సరికదా.. తమ ఉపాధి ఉంటుందో, లేదో తెలియక సందిగ్ధంలో ఉండిపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీని చంద్రబాబు నిలబెట్టుకోవాలని వలంటీర్ల సంఘ ప్రతినిధులు మన్మథరావు, బి.గంగారావు, జి.రమేష్, తిరుపతి రావు, కె.అప్పారావు, బి.రాజేంద్రప్రసాద్, కె.సతీష్, టి.ఈశ్వరరావు తదితరులు కోరారు.

సర్పంచ్‌లకు తెలియకుండా పనులు, బిల్లులా?



మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులకు సంబంధించిన బిల్లులు ఎన్ఆర్ఈజీఎస్ చట్టం ప్రకారం పంచాయతీ సర్పంచ్‌ల ఖాతాల ద్వారా గుత్తేదారులకు చెల్లింపులు జరిపించాలని పాచిపెంట మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు కోరారు. గ్రామంలో ఎన్ని పనులు చేస్తున్నాం... ఏ పనికి ఎంత బిల్లులు చెల్లించారో వంటి వివరాలు బహిర్గతం కావాలంటే చెల్లింపులు సర్పంచ్‌ల ఖాతాల ద్వారానే నిర్వహించాలన్నారు. గ్రామాభివృద్ధికి సంబంధించి పంచాయతీ తీర్మానంలో సర్పంచ్‌కు సముచిత స్థానం కల్పించాలని కోరారు. తమకు ఎలాంటి సమాచారం లేకుండానే గ్రామాల్లో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడం సరికాదని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

నిధులు జమ కాలే.. చదువుకునేదెలా!



2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి జేవీడీ నిధులు విడుదల కాకపోవడంతో తమ చదువులకు ఆటంకం కలుగుతున్నాయని సాలూరు ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో 2023–24 విద్యాసంవత్సరం కన్వీనర్ కోటాలో ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ ప్రవేశం పొందిన విద్యార్థులు వాపోయారు. ఏడాదికి రూ.42,600లు చొప్పున రెండేళ్లకు రూ.85,200 తల్లుల ఖాతాలో జమ కావాల్సి ఉందని విద్యార్థులు టి.శంకరరావు, జె.లీలాప్రసాద్, సీహెచ్ సతీష్, డి.అనూరాధ, సాయి తదితరులు తెలిపారు. సకాలంలో నిధులు జమకాకపోవడంతో చదువుకునేందుకు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు.

తాగునీరూ అందదాయే!



పార్వతీపురం పట్టణంలోని అగురువీధిలో కుళాయిల ద్వారా నాలుగురోజులకోసారి నీరు సరఫరా చేస్తున్నారని, దీంతో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆ ప్రాంతానికి చెందిన బుదరవలస లక్ష్మి, జి.రమణమ్మ, ఎం.సరోజని, వి.స్వాతి, జి.లలిత తదితరులు వాపోయారు. కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఉన్న తమ ప్రాంతంలో దాదాపు మూడు నెలల నుంచి ఇదే పరిస్థితి ఉందని చెప్పారు. వీధిలో 20 వరకు కుళాయిలు ఉంటే, అందులో ఐదు మాత్రమే పనిచేస్తున్నాయన్నారు. అందులోనూ చిన్న ధార వస్తోందని.. కొత్త కనెక్షన్లకు డబ్బులు కట్టినా, ఇప్పటికీ ఇవ్వలేదని తెలిపారు.

కస్తూర్బా మహిళలకే ఈ గతా?



ఎన్నో ఏళ్లుగా కేజీబీవీలో పనిచేస్తున్న చిరుద్యోగులను ఎలాంటి కారణాలూ లేకుండానే తొలగించి కొత్తవారిని నియమించుకుంటున్నారని పాచిపెంట కేజీబీవీలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేసిన ఎస్.ఉష, నైట్‌వాచ్ ఉమెన్ మంచాల కుమారి, జోగింపేట కేజీబీవీ వంట ఆయా ఎస్.రమాదేవి తదితరులు వాపోయారు. తమకు ముందస్తు సమాచారం లేకుండానే రాజకీయ ఒత్తిళ్లతో తొలగించి.. ఆ స్థానంలో ఎటువంటి అర్హతలూ లేని కొత్తవారిని నియమించుకున్నారని తెలిపారు. మూడు నెలల జీతం కూడా ఇవ్వలేదని వాపోయారు. ఎన్నోఏళ్లుగా పని చేస్తున్న తమను అర్ధాంతరంగా తొలగించి వీధిన పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

గిరిజన రైతులకు సాగు పట్టాలివ్వాలి



జిల్లాలోని పాచిపెంట మండలం గొట్టూరు పంచాయతీ పరిధి సర్వే నంబరు 48లో గిరిజన రైతులు సాగు చేస్తున్న 782 ఎకరాలకు సంబంధించి పట్టాలను మంజూరు చేయాలని సీపీఎం నాయకులు ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. తోకమెట్ట, మెట్టవలస, ఇప్పలవాడ, వలెసలమడ, కొత్తవలస, కుదుమూరు, కొండతాడూరు తదితర గ్రామాల గిరిజనులతో కలసి ధర్నా చేపట్టారు. గిరిజన రైతులు ఎస్. అప్పలస్వామి, ఎస్.స్వామయ్య, కొర్ర శ్రీను, జి.అప్పన్న, కొర్ర కళ్యాణ్, కె.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పని ప్రదేశంలో ఏదీ భరోసా!



వివిధ ప్రాంతాల్లో, కార్యాలయాల్లో పనిచేస్తున్న శ్రామిక మహిళలకు మౌలిక సదుపాయాలు.. లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని శ్రామిక మహిళా సంఘం నాయకులు జి.జ్యోతిలక్ష్మి, వి.ఇందిర, వై.శాంతి, ఎస్.గౌరీమణి, కె.రాజేశ్వరి, ఎం.గౌరి, కె.వరలక్ష్మి కోరారు. శ్రామిక మహిళా సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి, అధికారులకు వినతిపత్రం అందజేశారు. కేరళ, తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నట్లుగా పని ప్రదేశాల్లో మహిళలకు కూర్చోవడానికి బెంచీలు ఏర్పాటు చేయడంతో పాటు పనిభారం తగ్గించి కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు.

శభాష్

- వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో రాణించిన అన్నాచెల్లెళ్లు
- జాతీయ స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు అర్హత
- అభినందనలు తెలిపిన పాలకొండ వాసులు



జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన లలితరాణి, సునీల్

పాలకొండ రూరల్: వారికి వెయిట్ లిఫ్టింగ్ అంటే మహా ఇష్టం. చిన్నప్పటి నుంచి కఠోర సాధన చేస్తూ పతకాల పంట పండిస్తున్నారు. ఇప్పుడు ఒకే కుటుంబానికి చెందిన అన్నాచెల్లెలు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించి శభాష్ అనిపించుకున్నారు. వివరాల్లోకి వెళ్తే... పాలకొండ పట్టణం పెద్ద కాపు వీధికి చెందిన గార తిరుపతిరావు, చిన్నమ్మడుది మధ్య తరగతి కుటుంబం. వీరికి అరుణ రాణి, లలితరాణి, ఉషారాణి ముగ్గురు కుమార్తెలతో పాటు కుమారుడు సునీల్ ఉన్నారు. వీరంతా చిన్నతనం నుంచి క్రీడలపై ఆసక్తి కనబరుస్తుండంతో తల్లితండ్రులు ప్రోత్సహించారు. తాజాగా లలితరాణితోపాటు ఆమె సోదరుడు సునీల్ హిమాచల్‌ప్రదేశ్‌లో అక్టోబర్ 6–13 తేదీల మధ్య జరగనున్న జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారు. అర్హత విషయం సోమవారం కోచ్ రామకృష్ణ తెలియజేయడంతో ఆ కుటుంబం ఉబ్బితబ్బిబ్బవుతోంది. జాతీయస్థాయి పోటీల్లో రాణించాలని ఆకాంక్షిస్తూ క్రీడాకారులిద్దరికీ పాలకొండ వాసులు అభినందనలు చెబుతున్నారు.

పతకాల 'రాణి'

లలితరాణి 2009 నుంచి పతకాల పంట పండిస్తున్నారు. 2009, 2010 సంవత్సరాల్లో అమలాపురం, కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో బంగారు, వెండి పతకాల సాధించారు. అదే ఏడాది ఢిల్లీ, అరుణాచల్‌ప్రదేశ్, హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. 2014–15లో జాతీయ, రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో బంగారు, వెండి పతకాలు సాధించారు. 2017లో ఏలూరులో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్, సీనియర్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో రెండు స్వర్ణ పతకాలు సాధించి ఉత్తమ లిఫ్టర్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. 2018లో 3 బంగారు పతకాలతో పాటు ఉత్తమ లిఫ్టర్‌గా గుర్తింపు పొందారు. ఇదే ఏడాది ఆల్ ఇండియా స్థాయిలో గుంటూరు నాగార్జున యూనివర్సిటీ పరిధిలో జరిగిన పోటీలు, నాగపూర్‌లో జరిగిన జూనియర్ నేషనల్స్, గుంటూరులో జరిగిన సీఎం కప్‌లో బంగారు పతకాలు సాధించారు. 2019లో పూణేలో జరిగిన ఖేలో ఇండియా పోటీల్లో ద్వితీయ స్థానం దక్కించుకని దేశ స్థాయిలో ఈ ప్రాంతానికి గుర్తింపు తెచ్చారు. 2020–21లో పంజాబ్, నాగార్జున యూనివర్సిటీలో జరిగిన, 2022 భువనేశ్వర్‌లో జరిగిన పోటీల్లో బంగారు పతకాలు సాధించారు.

సునీల్ కూడా 2019 నుంచి వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రతిభ కనబరుస్తూ తాజాగా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరి అక్క అరుణరాణి 2002 నుంచి వెయిట్ లిఫ్టింగ్‌లో పట్టు సాధించారు. 2007లో జోర్డాన్‌లో నాలుగు దేశాల క్రీడాకారుల మధ్య జరిగిన 80కేజీల స్నాచ్, 110 కిలోల క్లీన్ అండ్ జర్క్ పోటీల్లో మూడు బంగారు పతకాలు సాధించి యువక్రీడాకారుల్లో స్ఫూర్తినింపారు.

ప్రజల దృష్టి మరల్చేందుకే లడ్డూ డ్రామా


- మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి



గుమ్మలక్ష్మీపురం: అధికారం చేపట్టిన 100 రోజుల్లో చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం చేసిందేమీలేదని, తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు, ప్రజల దృష్టిని మరల్చేందుకు 'లడ్డూ డ్రామా'ను తెరపైకి తెచ్చిందని మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి అన్నారు. ఈ మేరకు సోమవారం ఆమె జియ్యమ్మవలస మండలం చినమేరంగిలోని క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.

వరదల కారణంగా నీట మునిగిన అమరావతిని తెలియనీయకుండా చేయడం, విజయవాడ వరద బాధితులకు సాయం అందించకపోవడం, ప్రభుత్వ వైద్యవిద్యను ప్రైవేట్ పరం చేయడం, ఉచిత ఇసుక అంటూ ధర కట్టి అమ్మడం, పేద విద్యార్థులకు ఉపయోగపడుతున్న సీబీఎస్ఈ విద్యను దూరం చేయడం, సూపర్ 6 హామీలు అమలు చేయకపోవడం, ప్రజలకు ఏ సంక్షేమం అందివ్వనప్పటికీ నాలుగు నెలల్లో రూ.43వేల కోట్లు అప్పుచేయడం, విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్ పరం చేయడం వంటి అంశాలను ప్రజలెవరూ ప్రశ్నించకుండా వారి దృష్టిని మరల్చేందుకు.. కోట్లాది మంది భక్తుల విశ్వాసాల్ని దెబ్బతీసేలా కల్తీ నెయ్యి అంటూ కూటమి ప్రభుత్వం 'లడ్డూ డ్రామా' ఆడుతోందని ఆరోపించారు. ప్రజల కోసం చేసిందేమీ లేకపోయినా.. ఇది మంచి ప్రభుత్వం అంటూ బలవంతపు గొప్పలకు దిగడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి వ్యతిరేకత వస్తోందన్నారు. తల్లికివందనం, రైతుకు పెట్టుబడి సాయం, మత్స్యకార భృతి, నిరుద్యోగ భృతి వంటి సంక్షేమ పథకాలు అమలు చేయకుండా ఏదో ఒక విషయం తెరపైకి తెచ్చి ఆయా వర్గాలను ఏమార్చడంలో చంద్రబాబు దిట్ట అని ఆరోపించారు.

మడ్డువలస గేట్ల ఎత్తివేత



రెండు గేట్లు నుంచి వెళ్తున్న నీరు

వంగర: మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు వద్ద రెండు గేట్లను అధికారులు సోమవారం ఎత్తివేసి 3,200 క్యూసెక్కుల నీరు కిందకు విడిచిపెట్టారు. తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు సువర్ణముఖి, వేగావతి నదుల నుంచి ప్రాజెక్టులోకి మూడువేల క్యూసెక్కుల నీరు చేరుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టు వద్ద 64.54 మీటర్ల లెవెల్ నీటిమట్టం నమోదైనట్టు ప్రాజెక్టు ఏఈ నితిన్ తెలిపారు.

పర్యాటక దినోత్సవాన్ని విజయవంతం చేయండి



ఆడలి వ్యూపాయింట్ ప్రారంభోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, జేసీ, అధికారులు

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: జిల్లాలో ఈ నెల 27న నిర్వహించనున్న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలోని ఆడలి వ్యూ పాయింట్‌పై రూపొందించిన పోస్టర్‌ను ఆయన సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆ రోజు ఆడలి వ్యూ పాయింట్‌ను ప్రారంభిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ ఆడలిని సందర్శించి ప్రకృతి మనోహర దృశ్యాలను తిలకించాలన్నారు. ఆడలిలో కొంత సమయం గడపడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. మధ్యాహ్నం 4 గంటల నుంచి సీతంపేట అడ్వెంచర్ పార్క్‌లో ప్రపంచ పర్యాటక దినోత్సవం నిర్వహిస్తామని, పార్కులోని 5డి థియేటర్‌ను ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జేసీ ఎస్.ఎస్.శోభిక, పార్వతీపురం ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా ఇన్‌చార్జి రెవెన్యూ అధికారి జి.కేశవనాయుడు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి లోచర్ల రమేష్, జిల్లా ప్రణాళిక అధికారి పి.వీరరాజు, డీఈఓ జి.పగడాలమ్మ, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి ఎం.ఎన్.రాణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.విజయపార్వతి, తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ జీవీ ఇన్‌చార్జి వీసీకి లెగసీ అవార్డు



ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి

విజయనగరం అర్బన్: సీఎస్‌సీ ఇండియా నీతి ఆయోగ్ ప్రదానం చేసే 'అవుట్ స్టాండింగ్ లీడర్‌షిప్ లెగసీ అవార్డు' జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మిని వరించింది. ఈ మేరకు నీతి ఆయోగ్ నుంచి ఎంపిక ఆదేశాలు వచ్చినట్టు వర్సిటీ అధికారులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇంజినీర్ల దినోత్సవం సందర్భంగా జరిగిన జాతీయ స్థాయి ఉత్సవంలో వర్చువల్‌గా ఆమెకు ఇటీవల అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎస్‌సీ ఇండియా సీనియర్ లెర్నింగ్ కన్సల్టెంట్ వై.రామ్మోహనరావు మాట్లాడుతూ ప్రొఫసర్ రాజ్యలక్ష్మి ఇంజినీరింగ్ విద్యారంగంలో చేసిన దీర్ఘకాలిక కృషికి గుర్తింపుగా అవార్డు లభించిందన్నారు. అవార్డుకు ఎంపికైన ఇన్‌చార్జి వీసీని వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, డైరెక్టర్లు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, వివిధ విభాగాల అధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

పలువురు సీఐలకు బదిలీ

విజయనగరం క్రైమ్: విశాఖరేంజ్‌లో పనిచేస్తున్న పలువురు సీఐలను బదిలీచేస్తూ విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్‌జట్టి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. వీఆర్‌లో ఉన్న వెన్ని గోపీనాథ్‌ను శ్రీకాకుళం డీసీఆర్‌బీకి, వీఆర్‌లో ఉన్న టి.లక్ష్మిని అనకాపల్లి డీఎస్‌బీ–2కి, విజయనగరం డీఎస్‌బీ–2లో ఉన్న ఎ.వి.లీలారావును డీఎస్‌బీ–1కి, వీఆర్‌లో ఉన్న ఆర్‌వీఆర్‌కే చౌదరిని విజయనగరం డీఎస్‌బీ–2కి, వీఆర్‌లో ఉన్న వీవీసీఎం ఎర్రంనాయుడిని పార్వతీపురం మన్యం డీసీఆర్‌బీకి బదిలీ చేశారు.

క్లుప్తంగా

పోక్సో కేసులో ముద్దాయికి 20 ఏళ్ల శిక్ష

విజయనగరం క్రైమ్: జిల్లా మహిళా పోలీస్‌స్టేషన్‌లో 2023లో నమోదైన పోక్సో కేసుకు సంబంధించి ముద్దాయికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.7వేలు జరీమానా విధిస్తూ పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి సోమవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఈ కేసు వివరాలిలా ఉన్నాయి. పూసపాటిరేగ మండలం పెదతాడివాడ గ్రామానికి చెందిన కలిశెట్టి ఉమామహేశ్వరరావు అలియాస్ ఉమ అదే గ్రామానికి చెందిన బాలికను ప్రేమ పేరుతో వెంటపడి, లైంగికంగా వేధింపులకు గురిచేసేవాడు. 2022 నవంబరు 23న బాలిక ఒంటరిగా ఉన్న సమయంలో ఆమెపై లైంగిక దాడికి పాల్పడినట్లు బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో విజయనగరం మహిళా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కాగా, అప్పటి డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్టు చేసి, న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేశారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ పూర్తయ్యే విధంగా మహిళా పీఎస్ సీఐ ఈ.నరసింహమూర్తి చర్యలు చేపట్టారు. పోలీసుల తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మావూరి శంకరరావు ఈ కేసులో వాదనలు వినిపించారు.

దాడిలో గాయపడిన యువకుడి మృతి


శ్రీధర్ మృతదేహం

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండల కేంద్రంలోని గౌడు వీధికి చెందిన గౌడు శ్రీధర్ (24) తనపై జరిగిన దాడిలో తీవ్రంగా గాయపడడంతో విశాఖపట్నంలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గౌడు శ్రీధర్‌కు అదే కాలనీలో ఉన్న గౌడు లల్లు (రవి) అనే మరో యువకుడితో పాత తగాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈనెల 13వ తేదీన తెల్లవారు జామున ఇంట్లో నిద్రిస్తున్న శ్రీధర్‌పై లల్లు దాడికి పాల్పడ్డాడు. ఆ దాడిలో తీవ్రంగా గాయపడిన శ్రీధర్‌ను కుటుంబసభ్యులు కురుపాం ఆస్పత్రికి తీసుకువెళ్లి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడని, ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. మృతుడు శ్రీధర్‌కు తల్లిదండ్రులతో పాటు భార్య, కుమార్తె ఉన్నారు.

గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

రామభద్రపురం: మండలం పరిధిలోని ముచ్చర్లవలస గ్రామానికి చెందిన వ్యక్తి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బొంపలి సూర్యనారాయణ(50) మద్యానికి బానిస కావడంతో కుటుంబాల తగాదాల నేపథ్యంలో మనస్తాపం చెంది ఆదివారం గడ్డి మందు తాగేశాడు. ఈ విషయం గమనించిన కుటుంబ సభ్యులు విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారు జామున మృతిచెందాడు, భార్య కళావతి ఇచ్చిన ఫిర్యాదుమేరకు ఏఎస్సై ఐవీ రమణ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు, మృతుడికి భార్య, సాయిలక్ష్మి, సాయికుమార్ పిల్లలున్నారు.

నదిలో గల్లంతైన రైతు మృతదేహం లభ్యం


రైతు మృతదేహం

జామి: మండల కేంద్రం జామి గోస్తనీ నదిలో ఆదివారం సాయంత్రం ప్రమాదవశాత్తు గల్లంతైన రైతు కొత్తలి దేముడు (64) మృతదేహం సోమవారం మధ్యాహ్నం బయటపడింది. ఆదివారం రాత్రి నుంచి పోలీసులు, రెవెన్యూ సిబ్బంది మృతదేహంకోసం గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం ఉదయం ఎస్.కోట అగ్నిమాపక సిబ్బంది, తహసీల్దార్ ఐ.కృష్ణలత, ఏఎస్సై రాజనరసింగరావుల సమక్షంలో గాలింపు చేపట్టగా మృతదేహం లభ్యం కాకపోవడంతో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాన్ని రప్పించేందుకు తహసీల్దార్ ప్రయత్నిస్తున్న సమయంలో నీటిపై రైతు దేముడు మృతదేహం తేలింది. దీంతో స్థానికులు మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. అనంతరం శవపంచనామా చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుడికి భార్య లక్ష్మి ఉంది.

గాయపడిన వ్యక్తి మృతి


సురేష్ (ఫైల్)

శృంగవరపుకోట: మండలంలోని కొట్టాం గ్రామం వద్ద మూడురోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆదిరెడ్డి సురేష్ విశాఖలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. సురేష్ తన ద్విచక్రవాహనంపై గ్రామం నుంచి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మరో వాహనం ఢీకొట్టడంతో గాయపడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కూలీనాలీ చేసుకునే సురేష్ జీవించేవాడని అకస్మాత్తుగా మృత్యువాత పడడంతో కుటుంబం దిక్కులేనిదైందని, ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

- బెంబేలెత్తిస్తున్న నిత్యావసర సరుకులు
- హడలిపోతున్న వినియోగదారులు

వంటింట్లో ధరల మంట


మార్కెట్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న కాయగూరలు

కూరగాయలు	ధర (కేజీ రూ.లలో)
వంకాయ	45
బీరకాయ	40
బెండకాయ	40
దొండకాయ	40
పచ్చిమిర్చి	65
క్యారెట్	45
బీట్‌రూట్	55
బంగాళదుంప	40
చిక్కుడు	45
కాలీఫ్లవర్ రకాలు	30 నుంచి 40
ములక్కాడ	50
ఉల్లి	50 నుంచి 60 మధ్య

పాలకొండ రూరల్: మార్కెట్‌లో నిత్యావసర సరుకుల ధరలు మండిపోతున్నాయి. ఇటీవల వచ్చిన వర్షాలు, వరదలతో స్థానికంగా పండే కూరగాయల పంటలు దెబ్బతినడంతో వాటి ధరలకు రెక్కలొచ్చాయి. దిగుమతి సుంకం దెబ్బకు వంట నూనెల ధరలు అమాంతం పెరిగిపోయాయి. డిమాండ్‌కు తగ్గ ఉత్పత్తి లేక చికెన్, మటన్, చేపలు, రొయ్యల ధర కిలో రూ.250 నుంచి రూ.850, 900కు చేరుకోగా గుడ్లు రూ.7 నుంచి 8 పలుకుతుండడంతో ఏం కొనాలో? ఎలా తినాలో? అర్థం కాక పేద వర్గాల వారు అవస్థలు పడుతున్నారు. జిల్లాలోని 15 మండలాల్లో అనేక గ్రామాల ప్రజలు కాయగూరల సాగులపై ఆధారపడుతున్నారు. పాలకొండ–వీరఘట్టం రోడ్డు, తుమరాడ, గరుగుబిల్లి, రుద్రిపేట, అన్నవరం, చినమంగళాపురం, వీరఘట్టం, కంబర, దశమంతుపురం, చిదిమి రోడ్డు, పాలమెట్ట, సీతంపేట, భామిని, గుమలక్ష్మీపురం, కొమరాడ, గంగరేగువలస, కుమ్మరిగుంట, దలాయిపేట, కళ్లికోట, దుగ్గి, గుణానుపురం తదితర ప్రాంతాల్లోని వేల ఎకరాల్లో కూరగాయల పంటలు సాగవుతున్నాయి. ముఖ్యంగా బీర, బెండ, దొండ, వంకాయ, కాకర, ఆనప, టమాటో, క్యాబేజీ రకాలు, చిక్కుడు, కంది, ఆగాకరకాయలు తదితర పంటలను సేద్యం చేస్తున్నారు. జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో అల్పపీడనాలతో వచ్చిన వరుస వర్షాలతో స్థానిక రైతులు నష్టపోయారు. పంట రక్షించుకునే క్రమంలో అధిక మదుపులు పెడుతున్నారు. దీంతో జిల్లాలో కూరగాయల సాగు తగ్గింది. ఇతర జిల్లాల్లోనూ వరదల కారణంగా దిగుబడికి ఆటంకం ఏర్పడి. ఆ ప్రభావం ఈ ప్రాంత వినియోగదారులపై పడుతోంది.

ధరలకు రెక్కలు..

స్థానికంగా సాగవుతున్న పంటలు దెబ్బతినడంతో వాటి దిగుబడులు గణనీయంగా తగ్గిపోయాయి. మరోపక్క గణేష్ నవరాత్రి వేడుకలు ముగియడంతో జిల్లా వ్యాప్తంగా అన్న సమారాధనలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఉత్సవ కమిటీలు భారీ ఎత్తున అన్న సంతర్పణలు నిర్వహిస్తుండడంతో కూరగాయాలకు డిమాండ్ బాగా పెరిగి. గడిచిన వారంలో కేజీపై రూ.8 నుంచి రూ.10 ధర పెరిగినట్లు వినియోగదారులు చెబుతున్నారు. మరోపక్క ఉల్లిపాయల ధర రూ.50 నుంచి రూ.60కు చేరి దిగిరావడం లేదు. బయట మార్కెట్‌లో ధరలు ఇలా ఉంటే తోపుడు బండ్లు, సైకిళ్లపై అమ్మకాలు చేసే వారి ఆగ్గర వద్ద ఈ ధరలు మరో రకంగా ఉంటున్నాయి. ప్రస్తుతం వాతావరణం అనుకూలించి కొత్త పంటలు వేసేందుకు వీలులేని పరిస్థితి. మెట్ట ప్రాంతంలోని కూరగాయల పంటలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చేందుకు మరో మూడువారాల పైనే సమయం పడుతుందని వ్యాపారులు అంటున్నారు. వచ్చే నెల మొదటి వారంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు మొదలుకానుండడం, నవంబరులో కార్తీకమాసం ప్రారంభం కానుండడంతో కూరగాయల వినియోగం మరింత పెరగనుంది. దీంతో వాటి ధరలు మరింతగా ఆకాశాన్నంటే పరిస్థితి ఉండనుందని వర్తకులు చెబుతున్నారు.

ధరలు మండిపోతున్నాయి



గడిచిన వారం రోజుల్లో కూరగాయల ధర కేజీపై రూ.10 వరకూ పెరిగింది. నూనెల ధరలు మండిపోతున్నాయి. మధ్యతరగతి కుటుంబాలకు చెందిన మాలాంటి వారిపై ధరల ప్రభావం అధికంగా ఉంది. ధరల నియంత్రణ చేయకుంటే ఎలా? వ్యాపారులు డిమాండ్‌కు తగ్గట్లు దిగుబడి లేదంటున్నారు. పంటలు పండకపోవడంతో ధర పెరిగిపోతోందని చెబుతున్నారు. వచ్చే నెలల్లో మరింతగా కాయగూరల ధరలు పెరగనున్నట్లు పరిస్థితులు కనిపిస్తున్నాయి. రూ.వందకు రెండు రకాల కూరలు రావడం గగనంగా ఉంది.
– వి.ప్రమీల, పాలకొండ

నష్టపోతున్నాం



వరుస వర్షాలతో కూరగాయల పంటలు నష్టపోయాం. ప్రస్తుత నెలలో భారీ వర్షాలతో తీగజాతి, పందిరి సాగు తీవ్రంగా పాడై దిగుబడి తగ్గింది. నాణ్యతా లోపం పేరిట దళారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. వారికి నచ్చిన రేటుకు వినియోగదారులకు అమ్ముతున్నారు. అక్టోబర్‌లో కూడా వర్షాలు తప్పవని చెబుతున్నారు. ఇలా అయితే పంటలు సేద్యం చేయడం కష్టమే.
– నల్లిబాలు, కాయగూరల రైతు, గరుగుబిల్లి, పాలకొండ మండలం

కాక పుట్టిస్తున్న వంట నూనె

ఈడిబుల్, క్రూడాయిల్ దిగుమతులపై టాక్స్ పెంపుదల ఆయిల్ ధరలపై ప్రభావం చూపింది. రిఫైండ్ ఆయిల్స్‌పై పన్నును 13.75 శాతం నుంచి 35.75 శాతానికి, క్రూడాయిల్‌పై 5.5 శాతంగా ఉన్న కస్టమ్స్ డ్యూటీని 27.50 శాతానికి పెంచడంతో ఒక్కసారిగా ఆయిల్ ధరలు భగ్గుమన్నాయి. 850 గ్రాముల ఆయిల్ ప్యాకెట్స్‌పై రూ.19 నుంచి రూ.25 వరకు పెరగడం పేదవర్గాల వారికి భారంగా మారింది. వినియోగదారుల అవసరాలను అసరాగా చేసుకుని కొంతమంది వర్తకులు కృత్రిమ కొరత సృష్టించి కాసులు దండుకుంటున్నారు. ఈ వ్యవహారంపై కొరడా ఝుళిపించాల్సిన అధికారుల జాడ అంతంత మాత్రంగా ఉండడంతో ప్రజలకు ధరల భారం మోయక తప్పడం లేదు.

ఆకాశాన్ని తాకుతున్న మాంసాహారం

సీజనల్ వ్యాధుల బెడద, శ్రావణ మాసం ప్రభావంతో గత నెలలో కిలో రూ.150కు పడిపోయిన చికెన్ ధర మెల్లమెల్లగా పెరుగుతోంది. జిల్లాలో ఏడు లక్షల వరకు బ్రాయిలర్ కోళ్ల పెంపకం జరుగుతోంది. వినాయకచవితి ఉత్సవాల నేపథ్యంలో అమ్మకాలు పెద్దగా ఉండవని పూర్తిస్థాయిలో కొత్త బ్యాచ్‌లు వేయకపోవడంతో డిమాండ్‌కు తగిన స్థాయిలో కోళ్లు లేక వాటి ధర పెరుగుతోంది. ప్రస్తుతం కిలో రూ.230 నుంచి రూ.250కు చేరింది. మటన్ రూ.850 నుంచి రూ.900లకు చేరింది. మేలు రకం చేపలు కేజీ రూ.150నుంచి రూ.180కి చేరగా కొరమేను రూ.400, రొయ్యలు రూ.450 ధర పలుకుతున్నాయి. గుడ్డు రూ.7 నుంచి రూ.8కి చేరింది.

మాజీ మంత్రి పడాల అరుణ ఇంట విషాదం

- పరామర్శించిన శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స తదితరులు


మాజీ మంత్రి పడాల అరుణను ఓదార్చుతున్న శాసన మండలి ప్రతి పక్షనేత బొత్స సత్యనారాయణ, పక్కన ఆయన సోదరుడు మాజీ ఎమ్మెల్యే అప్పలనర్సయ్య

దత్తిరాజేరు: గజపతినగరం నియోజకవర్గం జనసేన నాయకురాలు మాజీ మంత్రి పడాల అరుణ కుమారుడు శరత్ అనారోగ్యంతో ఆదివారం సాయంత్రం మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న శాసనమండలిలో ప్రతిపక్ష నేత, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు బొత్స సత్యనారాయణ, ఆయన సోదరుడు గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్యతో కలిసి సోమవారం ఆమె ఇంటికి వెళ్లి మృతదేహం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. మృతికి గల కారణాలను మాజీ మంత్రిని అడిగి తెలుసుకుంటున్న సమయంలో ఆమె భోరున విలపించడంతో బొత్స సోదరులు ఆమెను ఓదార్చారు. ఒకగానొక్క కొడుకు మృతి చెందాడంటూ కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతమై రోదిస్తుంటే అక్కడికి వచ్చిన వేలాది మంది కళ్లు చెమ్మగిల్లాయి. వైఎస్సార్‌సీపీ నాయకురాలు, ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే శోభ హైమావతి, మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్‌దేవ్, మంత్రి గుమ్మడి సంధ్యారాణి నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని, చీపురుపల్లి ఎమ్మెల్యే కళావెంకటరావు, మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తండ్రి కొండలరావు, మాజీ ఎమ్మెల్యే కేపీ నాయుడు, పలు మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు మాజీ మంత్రి పడాల అరుణను పరామర్శించిన వారిలో ఉన్నారు.

న్యాయమూర్తి మానవేంద్రనాథ్ రాయ్‌కు మాతృవియోగం


విజయలక్ష్మి(ఫైల్)


విలపిస్తున్న కుటుంబ సభ్యులు

పార్వతీపురం: గుజరాత్ ఉన్నత న్యాయస్థాన న్యాయమూర్తి చీకటి మానవేంద్రనాథ్‌రాయ్‌కు మాతృ వియోగం కలిగింది. తల్లి చీకటి విజయలక్ష్మి(80) అనారోగ్యంతో విశాఖపట్నంలో ఆదివారం మృతిచెందారు. ఈ మేరకు పార్వతీపురంలోని స్వగృహంలో సోమవారం అంత్యక్రియలను నిర్వహించారు. విశాఖపట్నం జిల్లా న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, విజయనగరం జిల్లా న్యాయమూర్తి కళ్యాణ్ చక్రవర్తి, శ్రీకాకుళం జిల్లా న్యాయమూర్తి మౌలానా అహ్మద్, పార్వతీపురం అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.దామోదరరావు, ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ సామ్యజాస్పిన్‌లు భౌతిక కాయానికి శ్రద్ధాంజలి ఘటించారు. పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, ఎస్పీ మాధవరెడ్డి, బార్ కౌన్సిల్ అధ్యక్షులు నల్ల శ్రీనివాసరావు, వైద్యులు రామ్మోహనరావు, వై.వివేక్, న్యాయవాదులు టి.జోగారావు, బి. వెంకటనాయుడు, పీవీ కృష్ణారావు, జి.శశిభూషణరావు, డి.మహందాతనాయుడు, జి.వెంకటరావుతో పాటు పలువురు సంతాపాన్ని తెలిపారు. ఆమె ముగ్గురు కుమారుల్లో పెద్దకుమారుడు గుజరాత్ ఉన్నత న్యాయస్థాన న్యాయమూర్తి కాగా, మూడవ కుమారుడు వివేకానంద శ్రీనివాస్ ప్రస్తుతం రాజాం సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్నారు.

ఈ–లాటరీ ద్వారా ఇళ్ల స్థలాల కేటాయింపు


ఇళ్ల స్థలం కేటాయించిన పత్రాన్ని లబ్ధిదారుకు అందజేస్తున్న జేసీ సేతు మాధవన్

విజయనగరం అర్బన్: డెంకాడ మండలంలోని రఘుమండ వద్ద వీఎంఆర్‌డీఏ అభివృద్ధి చేసిన ఎన్‌టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్ లే అవుట్‌లో మిగిలిన 44 ఎంఐజీ ఇళ్ల స్థలాల కోసం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ఈ–లాటరీ ప్రక్రియ నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, డీఆర్‌ఓ ఎస్‌డీ అనితల సమక్షంలో కంప్యూటర్ ద్వారా లాటరీ నిర్వహించి స్థలాలను కేటాయించారు. లాటరీ విజేతలకు ప్లాటు కేటాయింపు పత్రాలను అందజేసి జేసీ వారిని అభినందించారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ ప్లానింగ్ అధికారులు శ్రీనివాసమూర్తి, గోపీనాథ్, సహాయ ప్లానింగ్ అధికారులు మౌనిక, నాయుడు, జేపీఓ జానకి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పరిహారానికి అర్హుల జాబితా ప్రదర్శించండి

- మరో రెండు వారాలు భారీ వర్షాలు
- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్


పొలం పిలుస్తోంది పోస్టర్‌ను విడుదల చేసిన కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇళ్లు దెబ్బతిని ప్రభుత్వం నుంచి పరిహారం పొందేందుకు అర్హులైన వారి జాబితాలను ఆయా గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శించి దీనిపై ఎవరికైనా అభ్యంతరాలుంటే వాటిని స్వీకరించి నివేదించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తహసీల్దార్‌లను ఆదేశించారు. జిల్లాలోని 20 మండలాల పరిధిలో 66 ఇళ్లు దెబ్బతిన్నాయని వాటికి పరిహారం అందించాలని తహసీల్దార్‌ల నుంచి నివేదికలు అందాయని ఆయా మండలాల్లో ఇళ్ల పరిహారానికి అర్హులైన వారి జాబితాలు ప్రదర్శించాలని కలెక్టర్ చెప్పారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం నుంచి తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్లు కోల్పోయిన వారి బ్యాంకు ఖాతాల్లో సెప్టెంబర్ 25న పరిహారం జమ చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా పంటనష్టం వివరాలకు సంబంధించి కూడా రైతుల నుంచి ఏవైనా అభ్యంతరాలుంటే స్వీకరించాలని సూచించారు. పరిహారం అందించడంలో ఏ ఒక్క రైతునూ విస్మరించారనే మాట రాకూడదని స్పష్టం చేశారు. వచ్చే రెండు వారాలపాటు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అన్ని మండలాల తహసీల్దార్లు, నోడల్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి ప్రమాదాలకు తావులేకుండా చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

పొలం పిలుస్తోంది పోస్టర్ ఆవిష్కరణ

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన పొలం పిలుస్తోంది పోస్టర్లను కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్‌డీఅనిత, ఉద్యానశాఖ డీడీ జమదగ్ని, ఏపీఎంఐపీ పీడీ లక్ష్మీనారాయణ, మార్కెటింగ్ ఎ.డి బి.రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

28న 'మన ఇల్లు మన గౌరవం'


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: మన ఇల్లు మన గౌరవం కార్యక్రమాన్ని ఈనెల 28న నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. జిల్లా అధికారులు, మండల అధికారులతో ఈ మేరకు కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సమీక్షించారు. ఇప్పటికే మంజూరైన ఇళ్లను వచ్చే ఫిబ్రవరి నెలలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలతో పాటు స్వయం సహాయక సభ్యులకు రూ.30వేలు రుణం లభిస్తుందని, మండల ప్రత్యేకాధికారులు మంగళ, బుధవారాల్లో మండలాల్లో పర్యటించి ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. 28న లబ్ధిదారులతో అవగాహన సదస్సు నిర్వహించి ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని చెప్పారు.

రైలు ప్రమాదంలో వ్యక్తి మృతి


ధనుంజయరావు(ఫైల్)


చిన్నారులతో తల్లి, భార్య కుటుంబసభ్యులు

జి.సిగడాం: జీవనోపాధి కోసం గుంటూరుకు బయల్దేరిన వ్యక్తి ప్రయాణం మధ్యలోనే ఆగిపోయింది. కుటుంబ పోషణ కోసం వెళ్లిన వ్యక్తి రైలు ప్రమాదంలో చనిపోయారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని ఆనందపురం గ్రామానికి చెందిన డొప్ప ధనుంజయరావు (26) సోమవారం గుంటూరు వెళ్లడానికి విజయనగరం జిల్లా చీపురుపల్లి రైల్వేస్టేషన్‌లో ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు. రైలెక్కిన కాసేపటికే నెల్లిమర్ల చంపావతి వంతెన దగ్గర రైలు నుంచి కాలుజారి పడిపోయి మృతి చెందాడని తోటివలస కూలీలు పోతురాజ నారాయణరావు మృతుడి కుటుంబానికి సమాచారం ఇచ్చారు. దీంతో వారు సంఘటన స్థలానికి వెళ్లారు. మృతుడికి భార్య మంగమ్మ, రెండేళ్ల పాప నిచిత, ఆరునెలల బాబు విరాట్ ఉన్నారు. ధనుంజయరావు మృతి చెందడంతో ఆనందపురం గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతదేహానికి శవ పంచనామా నిర్వహించాక గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. వీరిది సామాన్య కుటుంబమని ప్రభుత్వమే ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

గ్రీవెన్స్‌సెల్‌కు అధికంగా రెవెన్యూ సమస్యలు

- మొత్తం వినతులు 294


అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్


వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

విజయనగరం అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు అర్జీలు కుప్పలు తెప్పలుగా వచ్చాయి. వాటిలో రెవెన్యూ సమస్యలే అత్యధికంగా ఉండడం విశేషం. కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ కలెక్టర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి 294 వినతులు స్వీకరించి వాటి పరిష్కారం కోసం సంబంధిత జిల్లా అధికారులకు ఆదేశాలిచ్చారు. మండల స్థాయిలో పరిష్కారం కావాల్సిన పలు వినతులపై కలెక్టర్ నేరుగా ఆయా సమస్యలకు చెందిన మండలాల తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి ఆయా వినతులు పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన 294 అర్జీలలో రెవెన్యూ శాఖకు అధికంగా 227, డీఆర్‌డీఏకు 24, పంచాయతీరాజ్ శాఖకు 10, గృహనిర్మాణ సంస్థకు 9, ఈపీడీసీఎల్, విద్యాశాఖలకు 7 చొప్పున, వైద్యారోగ్యశాఖకు 6, గ్రామవార్డు సచివాలయాలు, ఆస్పత్రుల సమన్వయాధికారికి రెండు చొప్పున వినతులు వచ్చాయి. వినతుల స్వీకరణ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్, డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 81 ఫిర్యాదులు

విజయనగరం క్రైమ్: ప్రజల సమస్యల తక్షణ పరిష్కారానికి 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' ఎంతగానో ఉపయోగపడుతుందని ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఆయన ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించి ప్రజల నుంచి 81 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి చట్టపరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. తీసుకున్న చర్యల వివరాలను జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, ఎస్బీ సీఐ ఎ.లీలారావు, డీసీఆర్‌బీ ఎస్సై ఆర్.వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ల దుర్వినియోగంపై కఠిన చర్యలు

పార్వతీపురం: ప్రజా పెన్షన్లను అనర్హులకు అందజేస్తే కఠిన చర్యలు తీసుకోనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక, ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ, ఇన్‌చార్జ్ జిల్లా రెవెన్యూ అధికారి జి. కేశవ నాయుడు ప్రజల నుంచి 200 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు అందించిన అర్జీలపై వెంటనే చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో భాగంగా గరుగుబిల్లి మండలం రావుపల్లి గ్రామానికి చెందిన కొర్నాన రమేష్, ఎం.ఘట్టంనాయుడు, బోను ఎరుకునాయుడు, బొంతాడ కృష్ణవేణి, బొంతాడ కుడుములమ్మ, బార్ల పోతయ్యలకు మరణించినప్పటికీ పెన్షన్ల పంపిణీ జరుగుండడంపై ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో గ్రామస్తులు ఫిర్యాదు చేయగా చర్యలు తీసుకోనున్నట్లు కలెక్టర్ సమాధానమిచ్చారు. పెన్షన్ల మంజూరు, పంపిణీలో అవకతవకలకు పాల్పడితే అందుకు బాధ్యులైన సిబ్బందిపై కఠినచర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట

పార్వతీపురం టౌన్: ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తున్నట్లు ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల నుంచి 15 ఫిర్యాదులను ఆయన స్వీకరించారు. అర్జీదారులతో ఈ సందర్భంగా ముఖాముఖి మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకుని, వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, తల్లిదండ్రుల వేధింపులు, భర్త, అత్తారింటి వేధింపులు, భూ ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్‌లైన్ మోసం, ప్రేమ పేరుతో మోసం, ఇతర సమస్యలపై ఫిర్యాదుదారులు స్వేచ్ఛగా విన్నవించు కోగా, వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఎస్పీ ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదు అంశాలను పరిశీలించారు. వాటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవా లైనట్లయితే చట్ట పరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీ దారుల వినతులకు సకాలంలో పరిష్కారం

సీతంపేట: అర్జీదారులు పబ్లిక్ గ్రీవెన్స్‌లో ఇచ్చిన వినతులను సత్వరం పరిష్కరించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన 87 వినతులు స్వీకరించారు. వినతుల్లో భాగంగా తాగునీటిసదుపాయం కల్పించాలని వలసగూడకు చెందిన సుబ్బారావు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ మంజూరు చేయాలని ఆంపురానికి చెందిన జగన్నాయకులు వినతిపత్రం అందజేయగా సవర పోలయ్య వ్యవసాయ బోరు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు, మినీగురుకులంలో టీచర్ పోస్టు ఇప్పించాలని పి.నిరోషా, జల్లారకు చెందిన విశ్వనాథం వరదగోడ నిర్మించాలని కోరారు. కారక్యక్రమంలో ఏపీవో చిన్నబాబు, పీహెచ్‌వో గణేష్, గిరిజన సంక్షేమ శాఖ డీడీ అన్నదొర, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ ఈఈ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.